క్లుప్తంగా

మహాసభలను జయప్రదం చేయండి



నరసరావుపేట ఈస్ట్: వినుకొండలో ఈనెల 7, 8 తేదీలలో వినుకొండలో నిర్వహించనున్న సీపీఐ ద్వితీయ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు తెలిపారు. మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం చిత్రాలయ సెంటర్‌లోని మిల్లులలో కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఉప్పలపాటి రంగయ్య, చక్రవరం సత్యనారాయణరాజు, షేక్.జాన్‌చిన సైదా, రోడ్ల అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాద సంఘానికి కూలర్ బహూకరణ

నరసరావుపేట టౌన్: న్యాయవాద సంఘ కార్యాలయానికి పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది బోయిన పిచ్చేశ్వరరావు, బి.వి.ఆర్.కె. స్వామి, మేజర్ బి.ఎస్.ఆర్.కె. రాజులు వారి తండ్రి బోయిన సుబ్బారావు జ్ఞాపకార్థం రిఫ్రిజిరేటర్‌ను బహూకరించారు. శుక్రవారం న్యాయవాద సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో న్యాయవాద సంఘ అధ్యక్షుడు జీవీ సుబ్బారావుకు వీరు రిఫ్రిజిరేటర్‌ను అందజేశారు. కార్యక్రమంలో పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

వేడుకగా పింక్ కలర్ డే



చిలకలూరిపేట: పట్టణంలోని జీవీ ఐఐటీ స్కూల్‌లో పింక్‌కలర్ డేను శుక్రవారం వేడుకగా నిర్వహించారు. ఎల్‌కేజీ, యూకేజీకు చెందిన చిన్నారులు పింక్ కలర్ దుస్తులు, సీతాకోకచిలుక వేషధారణలతో సందడి చేశారు. కేక్స్, చాక్‌లెట్స్, బిస్కెట్స్, టెడ్డీబేర్స్, బెలూన్స్‌తో అలంకరించి ఆటపాటలతో అలరించారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా ఆడుతూ పాడుతూ ఎలాంటి ఒత్తిడి లేకుండా ఎక్కువ విషయాలు నేర్చుకొనే అవకాశం ఉంటుందని ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ డి.ఫణికుమార్ పాల్గొన్నారు.

సరుకుల పంపిణీకి ఏర్పాట్లు

నూజెండ్ల తహసీల్దార్ రమేష్‌కుమార్

నూజెండ్ల: నేటి నుంచి వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే రేషన్ సరుకులు పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ సురేష్‌కుమార్ తెలిపారు. మండలంలోని 41 రేషన్ షాపుల పరిధిలో 2182 మంది 65 సంవత్సరాలు నిండిన వృద్ధులు, వికలాంగులను గుర్తించడం జరిగిందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతినెలా 26వ తేదీ నుంచి నెలాఖరు వరకూ ముందస్తుగా లబ్ధిదారుల ఇంటి వద్దకే సరుకులు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. ఒకవేళ అందుబాటులో లేని వారు ఎప్పటిలా 1వ తేదీ నుంచి 15 తేదీలో రేషన్ దుకాణాల్లో సరుకులు తీసుకోవచ్చన్నారు. ఎటువంటి ఫిర్యాదులు రాకుండా డీలర్లు రేషన్ పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

వినుకొండలో హెల్త్ క్యాంపెయిన్



వినుకొండ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ ఆదేశానుసారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మండలంలోని కోటప్పనగర్‌లో డిస్ట్రిక్ట్ ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజీ ఫర్ హెచ్‌ఐవీ/ఎయిడ్స్ (దిశ) 104 వైద్యబృందం సమన్వయంతో ఇంటిగ్రేటెడ్ హెల్త్ క్యాంపెయిన్ (సమగ్ర ఆరోగ్య ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రచారంలో భాగంగా సాధారణ ప్రజలకు, జనాభాకు హెచ్‌ఐవీ, సిఫిలిస్, హెపటైటిస్ బీ అండ్ సీ పరీక్షలు నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్ సురేష్, హెచ్‌వో సీఐటీఐ ఔట్‌రీచ్ వర్కర్ ఆషా, జయలక్ష్మి, ఎంఎల్‌పీ హెచ్ ప్రమీలరాణి, లింక్ వర్కర్ శైలజ, డాక్టర్ నాగేశ్వరరావు, 104 స్టాఫ్, పాల్గొన్నారు.

పశుసంవర్ధక శాఖ 'బ్లాంకెట్' సర్వే

నకరికల్లు: పశు సంవర్ధక శాఖ ద్వారా చేపడుతున్న బ్లాంకెట్ సర్వేతో పాడి రైతులకు సంక్షేమ లబ్ధి చేకూరుతుందని వెటర్నరీ ఏడీ డాక్టర్ బి.వెంకటేశ్వర్లునాయక్ తెలిపారు. ఈ నెల 25 నుంచి సెప్టెంబర్ 15 వరకు నిర్వహించనున్న ఈ సర్వేను శుక్రవారం నకరికల్లులో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశు పోషకులు చదువుకున్నారా...? డ్వాక్రా గ్రూపుల్లో ఉన్నారా... కుటుంబ వార్షిక ఆదాయం, పశు పోషణ ద్వారా ఆదాయం, పశు పోషణకు బ్యాంకుల ద్వారా రుణాలు పొందారా, రుణం తీసుకునే సమయంలో ఏమైనా తనఖా పెట్టారా, తదితర వివరాలు సేకరించి జాబితా సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు తెలిపారు.

అంబా.. శాంభవి..



శావల్యాపురంలో ప్రత్యేక అలంకణలో అమ్మవారు



గణపవరం కోదండరామాలయంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు





పాలపాడురోడ్డులోని సింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో లక్ష్మీదేవి అవతారంలో కనకదుర్గ అమ్మవారు, పూజలు చేస్తున్న మహిళా భక్తులు

తొలి శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని అన్ని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపవరం కోదండ రామాలయంలో అమ్మవారికి అష్టోత్తర లక్ష్మీదేవి పూజ, కుంకుమ పూజ నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్ శర్మ, ఉమామహేశ్వర శర్మలు ఉదయాన్నే ఆలయ శుద్ధి చేసి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. గోత్రనామాలతో కుంకుమపూజలు నిర్వహించారు. తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

■ మండలంలోని కారుమంచి, పోట్లూరు, వేల్పూరు, మతుకుమల్లి, శావల్యాపురం తదితర గ్రామాల్లో మొదట శ్రావణమాసం వేడుకలు మహిళలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రమైన శావల్యాపురంలో వేంచేసియున్న కనకదుర్గమ్మ వారి దేవాలయంలో ఆలయ పూజారీ రావిపాటి సాయిభరత్ సారథ్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరణ చేసి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

■ శ్రావణ మాసం మొదటి శుక్రవారం నాడు పాలపాడురోడ్డులోని చిన్న సింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి వారి దేవాలయంలో లక్ష్మీదేవి అవతారంలో కనకదుర్గ అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. పలువురు మహిళలు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

- నాదెండ్ల, శావల్యాపురం , నరసరావుపేట

● పరదా మరిచారు!



పట్టణంలో సేకరించిన చెత్తను డంపింగ్‌యార్డుకు తరలించే మున్సిపల్ ట్రాక్టర్లుకు వెనుక డోర్ లేకుండానే పట్టణ వీధుల్లో ప్రయాణిస్తున్నాయి. ట్రాఫిక్‌లో వీటి వెనుక ప్రయాణించే వారికి దుర్వాసనతో పాటు ట్రాక్టర్లలోని చెత్త జారి రోడ్డుపై పడుతోంది. కనీసం చెత్తపైన పరదాలు కట్టి తీసుకువెళ్లాలన్న ధ్యాస పారిశుద్ధ్య సిబ్బందికి రావడం లేదు. ఉన్నతాధికారులు ఈ విషయంలో దృష్టి సారించాలని పలువురు పట్టణవాసులు కోరుతున్నారు. నరసరావుపేట

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చిలకలూరిపేట: అత్యవసర వైద్య చికిత్సలు అవసరమైన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతగానో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. పట్టణంలోని తన నివాసంలో ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన 43 మందికి రూ. 24.13 లక్షలు చెక్కులు అందజేస్తున్నట్లు వెల్లడించారు. పేద కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ అండ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ షేక్ కరిముల్లా, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అంగలూరు సొసైటీ అధ్యక్షుడిగా బాలయ్య



ఈపూరు (శావల్యాపురం): ఈపూరు మండలం అంగలూరు సొసైటీ నూతన అధ్యక్షులుగా తిరుమలశెట్టి బాలయ్య (అగ్నిగుండాల) డైరెక్టర్లు సోమిశెట్టి ఆంజనేయులు (బొగ్గరం) పాశం యల్లమంద (వనికుంట)లు శుక్రవారం ప్రమాణ స్వీకారం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పాల్గొని మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో నూతన కార్యవర్గ సభ్యులు రైతులకు మెరుగైన సేవలు అందించటం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, జనసేన నాయకులు నాగశ్రీనురాయల్, సొసైటీ సీఈవో కె.కోటేశ్వరరావు, వివిధ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు పరిష్కరించండి

చిలకలూరిపేట రూరల్ సీఐ బి.సుబ్బానాయుడు

యడ్లపాడు: నెలవారీ పర్యటనలో భాగంగా చిలకలూరిపేట రూరల్ సీఐ బి.సుబ్బానాయుడు శుక్రవారం యడ్లపాడు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో ఉన్న రికార్డులను, కేసుల పురోగతిని, సీసీటీఎన్‌లో నమోదు చేసిన వివరాలను స్వయంగా పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి చురుకైన చర్యలు తీసుకోవాలని ఎస్ఐ టి.శివరామకృష్ణకి సీఐ సూచించారు. పోలీస్ శాఖ పనితీరు మరింత ప్రభావవంతంగా ఉండేలా సిబ్బందికి మార్గదర్శకత్వం అందించారు. అనంతరం, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని సిబ్బందికి రెయిన్ కోట్లు పంపిణీ చేశారు.



సిబ్బందికి రైన్ కోట్లు పంపిణీ చేస్తున్న సీఐ సుబ్బా నాయుడు

ఈ సందర్భంగా సిబ్బందితో కలిసి పోలీస్ స్టేషన్ పర్యావరణాన్ని పరిశీలించి, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సమయపాలన, పారదర్శకతపై ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన సూచించారు.

పచ్చరంగేసి..



టీడీపీ వర్గీయుల పచ్చపిచ్చి అంతా ఇంతా కాదని నిరూపిస్తున్నారు. రోడ్డు వెంట సిమెంట్ పోల్స్ పాతి వాటికి టీడీపీ పసుపు రంగు వేసి పార్టీపై తమ ప్రేమను చాటుకున్నారు. రెండు రోజుల క్రితం ఎన్‌జీఓ కాలనీలో ఓ నాయకుడి కుమారుడు జన్మదినం సందర్భంగా కాలనీలోని పార్కుకు, రోడ్డుకు మధ్యలో మొక్కలు నాటారు. ఆ మొక్కల పూలు కూడా పచ్చనివే సుమా. ఆ మొక్కల రక్షణ కోసం వాటి ముందు సిమెంట్ పోల్స్ ఏర్పాటుచేసి వాటికీ పసుపురంగు పులిమారు. వాటి ముందు బెంచీలు ఏర్పాటుచేసి వాటికీ పసుపురంగు ముంచెత్తారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ప్రారంభించటం గమనార్హం. టీడీపీని కొమ్ముకాసే సామాజిక వర్గీయులు అధికంగా నివాసం ఉండే ఎన్‌జీఓ కాలనీలోకి ప్రవేశించే రోడ్డుపై ఉన్న ఆర్చికి కూడా పసుపురంగు పులిమారు. ప్రతిపక్షంలో ఉండగా వైఎస్సార్ సీపీ వర్గీయులు తమ పార్టీ రంగు పులుముతున్నారని హైకోర్టు దాకా వెళ్లి రచ్చచేసిన పచ్చ వర్గీయులు, తీరా వారు అధికారంలోకి రాగానే అవకాశం ఉన్నంతవరకు తమ పార్టీ రంగును వేసుకుని తెగ సంబర పడిపోతున్నారు.

- నరసరావుపేట

విద్యా ప్రమాణాల మెరుగుకు శ్రద్ధ వహించాలి

మండల ప్రత్యేక అధికారి ఎ. బాలసుబ్రహ్మణ్యం

యడ్లపాడు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలపై మెరుగుపరచడంలో అలసత్వం వహించవద్దని మండల ప్రత్యేక అధికారి ఎ. బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మూడు పాఠశాలలను ఎంపీడీవో వి.హేమలత దేవితో కలిసి ఆకస్మికంగా సందర్శించి విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులపై పరిశీలించారు. లింగారావుపాలెం హైస్కూల్‌లో విద్యార్థుల సామర్థ్యాలను స్వయంగా పరీక్షించిన అధికారి, ఉపాధ్యాయుల ప్రయత్నంపై సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులను షైనింగ్ స్టార్స్, రైజింగ్ స్టార్స్‌గా విభజించి బోధిస్తున్న తీరును అభినందించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమన్వయ సహకారమే విద్యార్థుల పురోగతికి దోహదపడుతుందన్నారు. అలాగే సొలస ఎంపీపీఎస్ (మెయిన్) పాఠశాలను పరిశీలించిన ఆయన, ఆవరణలో పెరిగి విస్తరిస్తున్న పార్థీనియం మొక్కల తొలగించాలని ఆదేశించారు. దీనిపై స్పందించిన ఎంపీడీఓ వి.హేమలతాదేవి, మండల ఎన్‌జీఆర్ఎఫ్ సిబ్బంది సహకారంతో వీటిని తొలగించే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బోయపాలెం వేద పాఠశాలను సందర్శించిన ప్రత్యేక అధికారి అక్కడి విద్యార్థుల విద్యా ప్రమాణాలు నిరాశ కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. బోధనా ప్రమాణాలను పెంపొందించి విద్యార్థుల్లో నైపుణ్యాలను మెరుగుపరచాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా నాణ్యత పెంపునకు చర్యలు కొనసాగుతాయని తెలిపారు.



బోయపాలెం పాఠశాలలో విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలిస్తున్న బాలసుబ్రమణ్యం

విద్యార్థుల పురోగతిపై పర్యవేక్షణ అవసరం

నకరికల్లు: విద్యార్థుల పురోగతిపై నిరంతర పర్యవేక్షణ అవసరమని ప్రత్యేకాధికారి ఝాన్సీరాణి సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని దేచవరం గ్రామంలో ఆదర్శ పాఠశాలను శుక్రవారం సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి భోజనాన్ని స్వయంగా రుచి చూశారు. హాస్టల్ వసతులు, అందిస్తున్న సౌకర్యాలపై విద్యార్థులతో మాట్లాడి వివరాలు సేకరించారు. పేరెంట్స్ కమిటీ సమావేశంలో తల్లిదండ్రులతో మాట్లాడాలని, విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేందుకు తల్లిదండ్రుల సహకారం తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం పాఠశాలకు కావలసిన వసతులను ప్రిన్సిపాల్ కె.వేళాంగిణి మేరిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పాఠశాలకు సమీపంలో చిలకలూరిపేట మేజర్‌పై వంతెన శిథిలావస్థకు చేరుకుందని మరమ్మతులు చేసే వరకు విద్యార్థుల బస్సును చల్లగుండ్ల మీదుగా నడపాలని, మౌలికవసతుల కల్పనకు కృషి చేయాలని కోరారు. అనంతరం ప్రత్యేకాధికారి ఝాన్సీరాణిని ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, డిప్యూటీ ఎంపీడీవో ప్రసాద్, సీసీ కనకారావు తదితరులు పాల్గొన్నారు.



దేచవరంలోని ఆదర్శ పాఠశాలలో రికార్డులు తనిఖీ చేస్తున్న ప్రత్యేకాధికారి ఝాన్సీరాణి

గిరిజన పాఠశాలలో తనిఖీలు

స్థానిక గిరిజన కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేకాధికారి ఝాన్సీరాణి తనిఖీలు చేపట్టారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఆమె వెంట ఎంపీడీవో జి.కాశయ్య, ఉపాధ్యాయులు భీకూనాయక్, వెంకటేశ్వర్లు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది ప్రసాద్, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

మిర్చిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

డాట్ సెంటర్ శాస్త్రవేత్త డాక్టర్ నగేష్

సత్తెనపల్లి: మిర్చి నారుమడుల పెంపకంలో యాజమాన్య పద్ధతులు పాటించాలని డాట్ సెంటర్ శాస్త్రవేత్త డాక్టర్ నగేష్ అన్నారు. సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల రైతు సేవా కేంద్రంలో శుక్రవారం సమగ్ర ఉద్యాన అభివృద్ధి మిషన్ పథకంలో భాగంగా మిరప నారు పెంపకంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డాట్ సెంటర్ శాస్త్రవేత్త డాక్టర్ నగేష్ ధూళిపాళ్ల, కంకణాలపల్లి గ్రామాల్లోని నర్సరీలను పరిశీలించి నర్సరీ యజమానులకు మిర్చిలో మేలైన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. విత్తన శుద్ధి కొరకు సెంటు నారుమడికి 1.5 కిలోల భాస్వరం, కిలో వేప పిండి, 80గ్రాముల ఫిప్రోనిల్ ఉపయోగించాలన్నారు. ఉద్యాన అధికారి ఎస్.సురేష్ మాట్లాడుతూ నర్సరీ చట్టం-2010పై అవగాహన కల్పించారు. నర్సరీలకు లైసెన్స్ కలిగి ఉండాలని, నర్సరీ చట్టాన్ని అతిక్రమించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పీఎం ఫసల్ బీమా యోజన కింద మిరపకు ఎకరానికి రూ.360 ప్రీమియం చెల్లిస్తే రూ.90 వేల వరకు కవరేజ్ వర్తిస్తుందన్నారు. డిజిటల్ గ్రీన్ జిల్లా కో ఆర్డినేటర్ మస్తాన్‌వలి ఫార్మర్ చాట్ అప్లికేషన్ గురించి వివరించారు. కార్యక్రమంలో ఫ్యూచర్ జనరల్ ఇన్సూరెన్స్ స్టాఫ్ పి.గోపి, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ కంచేటి సుబ్బారావు, గ్రామ నాయకులు కేదార్నాథ్, తిరుపతిరావు, గ్రామ ఉద్యాన సహాయకులు, నర్సరీ యజమానులు, రైతులు పాల్గొన్నారు.



మిరప నారు నర్సరీలను పరిశీలించి సూచనలు చేస్తున్న డాట్ సెంటర్ శాస్త్రవేత్త డాక్టర్ నగేష్

ఆసక్తి ఉన్న యూనిట్ల ద్వారా ఆదాయం పెంచుకోవాలి

డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఝాన్సీరాణి

సత్తెనపల్లి: మహిళలు ఆసక్తి కలిగిన యూనిట్లను ఎంచుకొని వాటిపై ఆదాయాన్ని పెంచేలా కృషి చేయాలని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.ఝాన్సీ రాణి అన్నారు. సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల గ్రామంలోని మండల సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం ఏపీఎంలు, సీసీలు, వీవోఏలతో సమీక్ష సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఝాన్సీరాణి మాట్లాడుతూ ఆ విధంగా యూనిట్లు చేపట్టడం ద్వారా ప్రభుత్వం ఆశించిన స్థాయిలో సత్ఫలితాలను ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను సభ్యులకు అందించేలా సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలన్నారు. జీవనోపాధులు, ఉన్నతి, బ్యాంకు లింకేజ్, ఎంసీపీ, ఏసీఎల్‌పీ, సూర్యఘర్, ఉల్లాస్, ఐబీ, స్త్రీ నిధి గురించి సిబ్బందితో మాట్లాడారు. సమావేశంలో డీపీఎంలు డేవిడ్, ఐబీ శ్రీనివాస్, బ్యాంకు లింకేజ్ శ్రీనివాస్, మల్లేశ్వరి, జిల్లా సమాఖ్య ప్రతినిధులు, డీపీఎంయూ ఏపీఎంలు సునీత, కృష్ణప్రియ, క్లస్టర్‌లోని ఏపీఎంలు, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రాజెక్ట్ డైరెక్టర్ ఝాన్సీరాణి

నిత్యావసర సరుకుల పంపిణీ తనిఖీ చేయాలి

తహసీల్దార్ కె.నగేష్

ముప్పాళ్ళ: మండలంలోని అన్ని గ్రామాల్లోను జరిగే నిత్యావసరాల పంపిణీ ప్రక్రియను ఆయా గ్రామ వీఆర్వోలు తనిఖీ చేయాలని తహసీల్దార్ కె.నగేష్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఉదయం 7.30గంటల కల్లా సంబంధిత గ్రామాల్లో ని త్యావసర సరుకుల పంపిణీలో భాగంగా 65 సంవత్సరాల పైబడిన వారికి, వికలాంగులకు డోర్ డెలివరీ ప్రక్రియను పర్యవేక్షించాలన్నారు. సకాలంలో దుకాణాలు తెరిచి ఉండేలా చూసుకోవాలని, ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పంపిణీ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ బాలవెంకటేష్, ఆయా గ్రామాల వీఆర్వోలు పాల్గొన్నారు.